ఘనంగా పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ తృతీయ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటుగా... అమ్మవారికి అష్టోత్తర కలశాభిషేకం, చండీ హోమం, పూర్ణాహుతి, శిఖరాభిషేకం పూజలు చేశారు. భక్తుల కోసం అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 6

శిల్పారామంలో నేటి నుంచి ఒడియా ఫుడ్ అండ్ క్రాఫ్ట్ మేళా

కొండాపూర్, ఫిబ్రవరి 6 : మాదాపూర్‌లోని శిల్పారామంలో ఈనెల 7, 8 తేదీల్లో ఒడియా ఫుడ్ అండ్ క్రాఫ్ట్ మేళాను నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ప్రత్యేక అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వాభిమాన్ ఒడియా ఉమెన్స్ వరల్డ్, శిల్పారామం సంయుక్త నిర్వహణలో రెండు రోజులపాటు ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒడిశాకు చెందిన సంప్రదాయ వంటకాలతో పాటు చేతి పనులు, మంత్రముగ్ధులను చేసే సాంస్కృతిక ప్రదర్శనలు మేళాలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీ సీఐగా రాజశేఖర్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 6 : కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో(సీఐ)గా ఎస్.రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం సీఐగా పని చేస్తున్న వెంకటేశ్వర్‌రావును సైబరాబాద్ సీటీసీ బదిలీ చేయగా... గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న ఎస్.రాజశేఖర్‌రెడ్డిని బదిలీ చేస్తూ... నగర కమిషనర్ ఆదేశాలను జారీ చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ సీఐగా రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నది. అలాగే కూకట్‌పల్లి సీఐగా రాజేశ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత సీఐ ముత్తును రాజేందర్‌నగర్ స్పెషల్ బ్రాంచికి బదిలీ కాగా... అతడి స్థానంలో గచ్చిబౌలి డీఐగా పనిచేస్తున్న రాజేశ్‌ను బదిలీ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

దుండిగల్, ఫిబ్రవరి 6 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ తన నివాసం వద్ద గురువారం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న కట్కామ్ శ్రీనివాస్‌కు రూ.60,000, కేతావత్ మంగమ్మకు రూ.22,500,ఎండీ బషీర్‌కు రూ.60,000ల చెక్కులు మంజూరయ్యాయి. వాటిని లబ్ధిదారులకు శ్రీశైలంగౌడ్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక సాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎ.జెమ్స్, అమర్‌బాబు, ధరణి, మధుయాదవ్, భరత్, మోతే శీను, సంజీవ్, టైగర్ రాములు, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి పేరుతో మభ్య పెట్టొద్దు..

మియాపూర్ , ఫిబ్రవరి 6 : ప్రజాపాలన దరఖాస్తులో నిమిత్తం లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిని కల్పించాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణను కొనసాగించాలన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సమర్పించిన ప్రజలతో గురువారం సతీశ్‌రావు మాట్లాడారు.

తోపుడుబండిలో మద్యం బాటిళ్ల విక్రయం

జీహెచ్‌ఎంసీ దాడుల్లో 92 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 6: రోడ్డు పక్కన తోపుడుబండీపై మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న స్థావరంపై శేరిలింగంపల్లి సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే మద్యం విక్రయాలు చేపడుతున్నారని స్థానికుల ఫిర్యాదుల మేరకు శేరిలింగంపల్లి సర్కిల్ ఎఎంహెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. కొండాపూర్ జేవీజీ హిల్స్‌లో పుట్‌పాత్ పక్కన బండికొట్టులో, రాజరాజేశ్వరీ కాలనీలోని ఓ తోపుడుబండిలో యదేచ్ఛగా మద్యం విక్రయాలు చేపడుతున్నట్లు కాలనీవాసుల నుంచి ఫిర్యాదు రావడంతో ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. దీంతో వివిధ బ్రాండ్లకు చెందిన 92 విస్కీ క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు సదరు బండికొట్టు, తొపుడుబండీలను జేసీబీతో తొలగించారు. మద్యం విక్రయాలపై, జీహెచ్‌ఎంసీ అధికారులకు, డయల్ 100 ద్వారా పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో తొపుడుబండీపై బెల్టుషాపు నిర్వహిస్తు మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న ఓ మహిళపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. గత కొద్ది కొద్ది రోజులుగా నిత్యం మద్యం విక్రయాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు వాపోయారు.

సెల్లార్ తవ్వారు.. పనులు మరిచారు..

- ప్రమాదకరంగా సెల్లార్ల తవ్వకం.. పట్టించుకోని అధికారులు...
- ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలంటున్న స్థానిక నాయకులు

కొండాపూర్, ఫిబ్రవరి 6 : ప్రమాదకర రీతిలో ఇష్టానుసారంగా సెల్లార్లను తవ్వుతూ.. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నిర్మాణదారులపై తగు చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మిద్దెల మల్లారెడ్డి తెలిపారు. ఇటీవలె సెల్లారు కూలిన ఘటనలో ముగ్గురు అమాయకులు ప్రాణాలు విడిచిన విషయాన్ని గుర్తు చేస్తూ... చందానగర్ డివిజన్ పరిధిలోని సురక్ష హిల్స్ గేట్ నెంబర్ 1 వద్ద తీసిన సెల్లార్‌పై చర్యలు తీసుకోవాలంటూ అధికారులను కోరారు. సదరు నిర్మాణదారుడు సెల్లార్‌కు అనుమతులు తీసుకుని ఇష్టానుసారంగా పక్కనే ఉన్న రోడ్డుకు ఏమాత్రం సెట్‌బ్యాక్ వదలకుండా తవ్వడంతో రోడ్డుతో పాటు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ కంపౌండ్ వాల్ గోడలు కూలిపోయిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు. ప్రజల రక్షణను దృష్టిలో పెట్టుకుని సదరు సెల్లార్‌ను వెంటనే పూడ్చివేయాల్సిందిగా కోరారు.

సెల్లార్ తవ్వడంతో కూలిన ప్రహరి

ప్రభుత్వ భూముల్లో వెలసిన ఆక్రమణలు తొలగింపు

బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లోని ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

దుండిగల్, ఫిబ్రవరి6: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్,బాచుపల్లి మండలం,రాజీవ్‌గాంధీనగర్ సమీపంలోని సర్వేనంబర్ 295 ప్రభుత్వ భూముల్లో వెలసిన ఆక్రమణలు,అక్రమనిర్మాణాలను స్థానిక రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. కొందరు అధికార పార్టీకి చెందిన నేతలు తమ అనుచరులతో గత కొంత కాలంగా రాజీవ్‌గాంధీనగర్ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి రాత్రికి, రాత్రే గదులు, బేస్‌మెంట్లు నిర్మిస్తున్నట్లు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడంతో గురువారం కూల్చివేతలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గిర్దావర్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో వెలసిన రెండు గదులతో పాటు మరో మూడు బేసిమెంట్లను నేలమట్టం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరించారు.

సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి

దుండిగల్, ఫిబ్రవరి6:మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు గురువారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ తమ కాలనీలు/బస్తీల్లో నెలకొన్న పలు సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం వివిధ శుభకార్యాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.కార్యక్రమంలో సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి

నేడు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



బాలాజీనగర్‌లో నూతనంగా నిర్మించిన వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 6: బాలాజీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవి అమ్మవారి విగ్రహప్రతిష్ఠ వేడుకలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మూడురోజులపాటు జరిగే ఈ వేడుకలకు దేవాలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి, పరివార దేవతా మూర్తుల ప్రతిష్ఠ విగ్రహాల ఊరేగింపులో పూజలు ప్రారంభం కానున్నాయి. శనివారం మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, బృత్విగ్‌వరణం, రక్షాబంధనం, గోమాత పూజ, యాగశాల ప్రవేశం,అఖండ దీపారాధనం, సాయంత్రం ప్రతిష్ఠా పూజలు జరగనున్నాయి. ఆదివారం ప్రాతఃకాల పూజలు, హోమాలు,విగ్రహాలకు విశేష ధ్యానాదివాసం, సాయంత్రం 108 మృత్తికా కళాశాలతో మహాన్యాసం, జీవ, కళా, ప్రాణ, తత్వ, న్యాస హోమాలు, రుద్ర, సూక్త హోమాలు, శయ్యాధివాసం పూజలు జరుగుతాయి. సోమవారం శ్రీవాసవి మాతా, శ్రీ నగరేశ్వరస్వామి, శ్రీ గణపతి, సుబ్రహ్మణ్య, నంది, ధ్వజ శిఖర పరిహార దేవతల యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ మూర్తి ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, అష్టబలి, మహాబలిహరణం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, అలంకరణం, గోమాతా దర్శనం,దర్పణ దర్శనం, భక్తులకు దేవతా ప్రథమ దర్శనం పూజలు ఉంటాయి. ఈ వేడుకలలో కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ పాల్గొని.. వాసవి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

డ్రగ్స్ విక్రేత, వినియోగదారులు అరెస్ట్

పరారీలో మరో నలుగురు నిందితులు

మాదాపూర్, ఫిబ్రవరి 6: వేర్వేరు సంఘటనలో మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. నిందితులతోపాటు బెంగళూరుకు చెందిన మరో ఐటీ ఉద్యోగి పరారీలు ఉన్నారు. గురువారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన ప్రకారం... ఇజ్జత్ నగర్‌లోని అలేఖ్య హోమ్స్‌లో నివాసం ఉంటున్న చంద్రపు ప్రసన్నకుమార్ రెడ్డి(28) ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. బెంగళూరులోని హెబ్బల్‌కు చెందిన కెవిన్(40) డ్రగ్స్ వ్యాపారి. ఈనెల 6న ప్రసన్నకుమార్‌రెడ్డికి డ్రగ్స్‌ను విక్రయించేందుకు కెవిన్ మాదాపూర్‌లోని హైటెక్స్ మెటల్ చార్మినార్ వద్దకు వచ్చాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు డ్రగ్స్ వ్యాపారి కెవిన్‌ను అరెస్ట్ చేసి ప్రసన్నకుమార్‌రెడ్డి వద్ద రూ.5లక్షల విలువైన 23 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకోగా.. మరో ఇద్దరు నిందితులు పాల్వంచకు చెందిన జూపల్లి విశ్వ మిత్ర, మణికొండకు చెందిన శ్రీనివాస సాయి దీపక్, సికింద్రాబాద్‌కు చెందిన వరుణ్ గౌడ్‌లు పరారీలు ఉన్నారు. ఇదిలా ఉండగా.. కెవిన్ ఇది వరకు బెంగళూరులో డ్రగ్స్‌ను విక్రయించేవాడని, ప్రస్తుతం హైదరాబాద్‌లో విక్రయించడం మొదలుపెట్టినట్లు పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.5లక్షల విలువైన కొకైన్, రూ.10లక్షల విలువైన బ్రెజ్జా కారులను స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్‌లోని చందానాయక్ తండాలోని పీజీ హాస్టల్‌లో నివాసం ఉంటున్న గుత్తా తేజ కృష్ణ(28) అర్కిటెక్ట్‌గా చేస్తూ బెంగళూరుకు చెందిన సంధ్య(27) ఐటీ ఉద్యోగం చేస్తూ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు. ఈనెల 6న మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ వద్ద డ్రగ్స్ కొనుగోలు చేస్తుండగా సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు గుత్తా తేజ కృష్ణను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించగా.. సంధ్య పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తేజ కృష్ణ వద్ద నుండి రూ.1,33,680 లక్షల విలువైన 11.14 గ్రాముల ఎండిఎంఏతో పాటు రూ. 20 వేల విలువైన మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో మాదాపూర్ డీసీపీ వినీత్ ఎస్ఓటీ బృందాన్ని అభినందించారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

కొండాపూర్ డీఈ శ్యాంకుమార్

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 6 : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కొండాపూర్ డీఈ శ్యాంకుమార్ తెలిపారు. గురువారం సైబర్ సిటీ సర్కిల్ కొండాపూర్ విద్యుత్ డివిజన్ పరిధిలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికను డీఈ శ్యాంకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రానున్న వేసవికాలంలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యుత్‌లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు చేసినట్లు తెలిపారు. లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. అలాగే డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించే దిశగా... వినియోగదారుల ఫిర్యాదుల (సమస్యల) పరిష్కార వేదికను నిర్వహించగా.. 8 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.ఈ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైర్ పర్సన్ బి.లలిత, ఫైనాన్స్ మెంబర్ కె.శోభారాణి, ఇండిపెండేంట్ మెంబర్ వి.అనిల్‌రెడ్డి, ఎస్ఏవో రవికుమార్, ఏడీఈలు మాణిక్యాలు, కమలాకర్‌రెడ్డి, ఏవో రెవెన్యూ మనోహర్, ఏఈలు విజయప్రకాశ్, బీమలింగప్ప, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికలో డీఈ శ్యాంకుమార్, లలిత, శోభారాణి తదితరులు

సూరారం కట్టమైసమ్మ జాతర..

రేపు, ఎల్లుండి ట్రాఫిక్ మళ్లింపు

దుండిగల్,ఫిబ్రవరి6: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,గాజులరామారం సర్కిల్ పరిధిలోని సూరారం కట్టమైసమ్మ,రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర సందర్భంగా ఆదివారం,సోమవారం రెండు రోజుల పాటు ట్రాఫిక్ దారి మళ్లిస్తున్నట్లు సైబరాబాద్ కమిషనరేట్, ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. కట్టమైసమ్మ, రేణుకాఎల్లమ్మ ఆలయాలు బాలానగర్-నర్సాపూర్ ప్రధాన రహదారిలో ఉన్నందున జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రధాన జాతర ఆదివారం(ఈనెల 9), సోమవారం రెండురోజుల పాటు సూరారం చౌరస్తా నుంచి బహదూర్‌పల్లి వైపు వెళ్లే సాధారణ వాహనాలను, అదేవిధంగా బహదూర్‌పల్లి చౌరస్తా నుంచి సూరారం చౌరస్తా వైపు వచ్చే లైట్‌మోటార్ వెహికిల్స్‌ను ఆలయం ముందు డివైడర్‌కు ఒకవైపు రోడ్డును రెండుగా విభజించి రాకపోకలకు అనుమతి నిస్తామన్నారు. అయితే గండిమైసమ్మ చౌరస్తా వైపు నుంచి బాలానగర్ వైపు వచ్చే హెవీ వెహికిల్స్ మాత్రం బహదూర్‌పల్లి చౌరస్తా నుంచి ఎడమవైపు తిరిగి దూలపల్లి చౌరస్తాకు చేరుకుని, అక్కడ కుడివైపునకు మళ్లీ జీడిమెట్లలోని జేఈటీఎల్ నుంచి ప్రధాన రహదారిపైకి చేరుకోవాలన్నారు. ఈనెల 8నుంచి 12వ తేదీ వరకు అమ్మవార్ల జాతర మహోత్సవాలు జరుగనున్నాయి.

మౌలిక వసతుల కల్పనకు కృషి

అల్లాపూర్,ఫిబ్రవరి6: డివిజన్ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సెంట్రల్ అల్లాపూర్‌లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జెకె పాయింట్ ప్రధాన కూడలి వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పాడవండంతో తరుచూ పొంగుతుందని, అలాగే సీసీరోడ్లు కూడా వేయాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,ఆయా శాఖల అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నసీర్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ అల్లాపూర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

పారిశుధ్య కార్మికురాలి అదృశ్యం

దుండిగల్, ఫిబ్రవరి 6: హాస్టల్లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లి అన్నం తినిపించి వస్తానని చెప్పి బయటకు వెళ్లి అదృశ్యమైన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, రాజీవ్‌గృహకల్ప, 103 బ్లాక్‌లోని 24వ ఫ్లాట్‌లో నివాసముంటున్న యాదమ్మ(35) అనే మహిళ స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలో స్వీపర్‌గా పనిచేస్తున్నది. ఈ నేపథ్యంలో ఈనెల 3వ తేదీన(సోమవారం) సాయంత్రం ప్రగతినగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న తన కూతురును కలిసి వస్తానంటూ ఇంట్లో చెప్పి బయటకువెళ్లిన యాదమ్మ రాత్రి పొద్దుపోతున్నప్పటికీ ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో వెతికారు. బంధువులు, స్నేహితుల ఇండ్లల్లోనూ ఆరా తీశారు. అయినప్పటికీ ఫలితం లేకపోడవంతో గురువారం బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాదమ్మ(ఫైల్)

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొండాపూర్, ఫిబ్రవరి 6 : గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం... లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ ప్లాట్‌ఫాం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(60) పడి ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని పరిశీలించగా.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేదలకు కష్టకాలంలో సాయం

ఎమ్మెల్యే కృష్ణారావు

అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు కష్టకాలంలో ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్‌తో సాయం చేస్తుందని కూట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో మోతీనగర్ కాలనీకి చెందిన టి.సుదర్శన్‌బాబుకు రూ.3 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే కృష్ణారావు అందజేశారు. వైద్యశాలలో ఖర్చుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 6

ప్రజా సంక్షేమమే ధ్యేయం : మాజీ కౌన్సిలర్ కృష్ణ

మహిళలు,బీఆర్ఎస్ కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్,ఫిబ్రవరి 6: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత,దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శంభీపూర్‌లోని కార్యాలయంలో గురువారం నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, మహిళలు శంభీపూర్ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన కృష్ణ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనంతరం పలు శుభకార్యాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

అంటువ్యాధులను మించిన జీవనశైలి వ్యాధులు

జీవనశైలితో వచ్చే వ్యాధులు అంటువ్యాధులను మించిపోయాయని అపోలో దవాఖానల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి అన్నారు. అపోలో హాస్పిటల్స్, ఈసీఎంఓ సొసైటీ ఆఫ్ ఇండియా, సొసైటీ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్‌తో కలిసి మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన అత్యాధునిక క్రిటికల్ సర్వీస్, ఈసీఎంఓ (ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజన్)పై శిక్షణా ముగింపు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... జీవనశైలిలో వచ్చే వ్యాధులను త్వరగా గుర్తించగలిగితే నివారించడం సులభమవుతుందన్నారు. ప్రో హెల్త్ సర్వీస్ అనేది ఈ రోగాలు తీవ్రమయ్యే ముందే గుర్తించాడినికి హాస్పిటల్ తీసుకున్న ముఖ్యమైన ముందడుగు అన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు, దేశం నలుమూలల నుంచి వైద్య విద్యార్థులు హాజరయ్యారు. – కొండాపూర్, ఫిబ్రవరి 6

చదువుపై ఒత్తిడితో దుర్గంచెరువులో దూకి విద్యార్థి ఆత్మహత్య

మాదాపూర్, ఫిబ్రవరి 6: చదువుపై ఒత్తిడితో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన ప్రకారం...యూపీలోని ఇబ్రహీంపూర్‌కు చెందిన రవీంద్రకుమార్ తన కుమారుడు రుద్రసింగ్(18)తోపాటు కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని మియాపూర్ జేపీనగర్‌కు వలస వచ్చారు. తన కుమారుడు రుద్ర సింగ్‌ను మాదాపూర్ కాకతీయ హిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజిక్స్ వాలా కళాశాలలో చేర్పించారు. దీంతో ఉపాధ్యాయులు చదువుపై ఒత్తిడి పెంచడంతో ఈనెల 1న రుద్రసింగ్ మాదాపూర్‌లోని దుర్గంచెరువు వద్దకు చేరుకొని అందులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో రుద్రసింగ్ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని లేక్ పోలీసులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టగా.. మూడురోజుల తరువాత మృతదేహం లభ్